# హంతకుడు

"ఒక హత్య చేయాలి"

ఇదీ నా ఆలోచన.

ఆలోచన తెగేలోగానే జనవరి 20 వచ్చేసింది. అంటే ఇంక నాకు ఒకే ఒక్క రోజు టైముంది.

హత్య చేయడానికి జనవరి 21 డెడ్‌లైన్! అంటే ఆ రోజు గడిచి పోతే నేను హత్య చేయనని కాదు. అనుకున్న రోజుకు హత్య జరక్కపోతే అది నా వృత్తికే అవమానం.

ప్రతినెలా నన్ను నేను సమీక్షించుకునే నాకు ఏడాదికి నాలుగు డెడ్ లైన్సున్నాయి.

ఏప్రిల్ 21 లోగా మానభంగం, జూలై 21 లోగా దొంగతనం, అక్టోబర్ 21 లోగా మోసం, జనవరి 21 లోగా హత్య...

ఇవి నా వృత్తి నాకు నిర్ణయించిన డెడ్ లైన్సు. వీటిని నేను కచ్చితంగా అనుసరించడం వల్లనే సమాజంలో గౌరవం, ప్రజల్లో పాప్యులారిటీ, ఇంట్లో డబ్బు నాకు లభించాయి.

ఆరు సంవత్సరాలుగా ఒక్కసారికూడా నేను నా డెడ్ లైన్సు మీటవకపోవటం జరగలేదు. కానీ ఈసారి హత్య విషయంలో ఇబ్బంది వచ్చింది.

ముందు రొటీన్ హత్య చేయాలనుకున్నాను.

ఒకే అబ్బాయిని ఇద్దరమ్మాయిలు ప్రేమించారు. అబ్బాయికి ముందావిషయం తెలియదు. తెలిసేక ఏ అమ్మాయీ అతడి గురించి హత్య చేయగలిగే స్థితిలో లేదు. ఓ అమ్మాయిని చంపుదామనుకున్నాను. ఆ విధంగా అబ్బాయి సమస్య పరిష్కరించవచ్చుననుకుంటే - ఆ అబ్బాయి యిద్దరమ్మాయిల్నీ పెళ్ళిచేసేసుకున్నాడు. సమాజం ఊరుకుంటుందా అంటే ఆ కథే సినిమాగా వచ్చి హిట్టయింది.

పోనీ అని ఒకే అమ్మాయి యిద్దరబ్బాయిల్ని వెతికి పట్టుకున్నాను. అమ్మాయి ఒకణ్ణి ప్రేమించింది. ఇంకొకణ్ణి పెళ్ళాడింది. కొన్నాళ్ళకు భర్తకు అసలు విషయం తెలిసింది. భర్తను చంపాలా, ప్రేమికుణ్ణి చంపాలా అని తెగ ఆలోచించాను. ఈలోగా భర్త భార్యను పిలిచి, ఈ ప్రపంచంలో పెళ్ళికి ముందు అనుభవముండని ఆడదుండదని నాకు తెలుసు. కానీ నువ్వు వేరనుకుని ఇన్నాళ్ళు బెంగపడ్డాను. నా అదృష్టం బాగుంది. ఇక్కణ్ణించి రోజూ రాత్రి పూట సెలవు రోజైతే పగటి పూట కూడా-గతంలో నీ అనుభవాలన్నీ వివరంగా చెప్పి నన్ను రంజింపచేయి. నీకు వాడొక్కడే కాక ఇంకా ఎంత మంది ఎక్కువ ప్రియులుంటే నేనంత సంతోషిస్తాను" అన్నాడు. నేను తెల్లబోయినా, సమాజం వాడిని దుయ్యబడితే తట్టుకోగలడా అనుకున్నాను. కానీ వాడి కథ ఓ పత్రికలో సీరియల్‌గా వచ్చి పెద్ద హిట్ అయ్యి సమాజంలో ఎన్నో పత్రికల సీరియల్సుకి ఆదర్శమైంది.

పోనీ సమాజానికి ఉపకారం చేద్దామని ఓ పెద్ద గూండాని చంపాలనుకున్నాను. ఈ లోగానే వాడు క్యాబినెట్ మంత్రి అయి ప్రజల చేత సన్మానాలు పొందాడు. పోనీ మంత్రులు భయపడే ఉగ్రవాదుల్ని చంపుదామనుకుంటే - వాళ్ళెంతమందో తెలియదు. ఎక్కడుంటారో తెలియదు. కానీ పోలీసులు వాళ్ళను ప్రతి రోజూ ఎందరినో చంపుతున్నారు. ఉగ్రవాదుల్ని

వెతికి పట్టుకుని చంపే రహస్యం చెప్పమని పోలీసుల్ని బ్రతిమాలుకుంటే వాళ్ళు పుసుక్కుమని నవ్వి, "మా చేతుల్లో ఎవడు చస్తే వాడు ఉగ్రవాది అదంతే!" అన్నారు.

ఇక కోపం వచ్చి ఏ సామాన్యుడినో చంపాలనుకున్నాను. కానీ అందువల్ల నా విలువేం పెరుగుతుంది? టెర్రరిస్టుల పేరుతో రోజూ ఎందరో సామాన్యులు చస్తూంటే ప్రజలు ఆవేశపడకుండా "స్కోరెంత?" అని నిర్లిప్తంగా అడిగి తెలుసుకుంటున్నారు. ప్రభుత్వం కూడా నిర్లిప్తంగా క్రికెట్ స్కోర్ చెప్పినట్లే వార్తల్లో మృతుల సంఖ్య తెలియబరుస్తోంది.

ఈ దేశంలో సామాన్యుల ప్రాణానికి బొత్తిగా విలువలేదు. నాకు గుర్తింపు రావాలంటే ఏ రాజకీయనాయకుడినో చంపాలి. అదీ సామాన్యంగా కాదు. గొప్పగా పథకం వేసి. ఆ పథకం కూడా సామాన్యంగా ఉండకూడదు. రాజీవ్ గాంధీని హ్యూమన్ బాంబుతో చంపినట్లు...............

మళ్ళీ దెబ్బ తిన్నాను. ఈ దేశంలో ఇందిరా గాంధీ వంటి పవర్‌ఫుల్ ప్రధానమంత్రిని సెక్యూరిటీ గార్డు కాల్చి చంపాడు. రాజీవ్‌గాంధీ వంటి ఎదురు లేని నాయకుణ్ణి అద్భుతంగా ప్లాన్ చేసి చంపారు. అంతకంటే గొప్పగా ఏ నాయకుడినో చంపితే తప్ప నాకు గుర్తింపు రాదు. గుర్తింపు అంటే హంతకుడిగా కాదు......హత్య చేసి తప్పించుకునే పథకానికి......

కానీ ఎలాంటి నేరం నుంచైనా ఎందరో తప్పించుకుంటున్నారు. పోలీసు డిపార్టుమెంటులో, ప్రభుత్వ రంగంలో, న్యాయస్థానంలో అవినీతి పేరుకు పోవడం వల్ల తప్పించుకుందుకు తెలివి అవసరం లేకపోతోంది.

నేను చేసే హత్య, హత్యకు నేను వేసే పథకం నాకో సవాలు కావాలి.

చివరకు మానవాతీత శక్తుల నాశ్రయిద్దామా అంటే - సాటి మనిషితో మాట్లాడడం కంటె వాటితో వ్యవహారించడమే సులభమనిపించేటంత ఫిక్షన్ కథలు, సినిమాల రూపంలో మన చుట్టూ వుంది.

ఇలా ఆలోచిస్తూ రోజులు గడిపేసి గడిపేసి జనవరి 20 చేరుకున్నాను. అప్పటికీ ఏమీ తేలక ఆ రోజంతా యింట్లోనే ఉండిపోతే గంటలు గడిచాయి తప్ప ఆలోచనలు రాలేదు.

సాయంత్రమయింది.

శ్రీమతి టీవీ చూడ్డానికి పిలిచింది.

మా యింట్లో ఎంతో ఆసక్తికరంగా టీవీ చూసేది శ్రీమతి ఒక్కతే! ఎందుకంటే శ్రీమతికి వాగుడెక్కువ. ఆమె చెప్పేమాటల్ని వినే ఓపిక, నేనూ, పిల్లలూ కూడా ఎప్పుడో కోల్పోయాం. ఎదిరించే ధైర్యం లేక వింటున్నట్లు నటిస్తాం కానీ ఒక్క మాట కూడా వినం. అది కొంత కాలానికామె తెలుసుకుంది. అప్పట్నించీ ఆమె టీవీ చూడ్డం ప్రారంభిం చింది.

శ్రీమతి టీవీని ఒంటరిగా చూడదు. తోడుండాలి. ఆ తోడుతో ఆమె ఆగకుండా వాగుతుంది. ఆమె మాటలు శ్రద్ధగా వినకపోతిమా ఎంతో కొంత టీవీ ప్రోగ్రాం కళ్ళలోకీ, చెవుల్లోకీ దూరుతుంది. ఆ బాధ అనుభవించిన వారికే తెలుస్తుంది. అందుకని ఏకాగ్రతతో శ్రీమతి మాటలు వినడం జరుగుతుంది. అదామెకు అద్భుతావకాశం. టీవీ కార్య క్రమాలు పెరిగితే సంతోషించే వారిలో శ్రీమతి ప్రథమురాలు.

అటు తల్లి, ఇటు టీవీ - రెండింట్లో ఏది ఎన్నుకోవాలా అని ఆలోచించి ఆలోచించి పిల్లలు చదువులో పడిపోయారు. వాళ్ళిద్దరూ కూడా యిప్పుడు స్కూల్లో ఫస్టుగా వస్తూ మా

పెంపకానికి పేరు తెచ్చారు.

ఉత్తప్పుడు కంటే టీవీ దగ్గర శ్రీమతి మాటలు నాకు భయంకరానుభవం. అందుకని టీవీ సమయంలో ఏదో పని కలగజేసుకుంటాను.

అప్పుడు శ్రీమతి పిలవగానే, "ఇప్పుడే ఓ గొప్ప అయిడియా వచ్చింది. మళ్ళీ మరిచిపోతానని భయంగా ఉంది" అన్నాను.

"అన్నీ అబద్ధాలు" అంది శ్రీమతి కొద్దిగా గారాం చేస్తూ. కానీ అయిడియా అనగానే ఆమెకు ఆశ. నా అయిడియాలలోంచి డబ్బు పుట్టుకొస్తుందని ఆమెకు బాగా తెలుసు.

"నిజం" అన్నాను.

"పిల్లల మీద ఒట్టు - " అనడిగింది శ్రీమతి.

పెళ్ళయిన కొత్తలో అన్నింటికీ తన మీద ఒట్టేయించుకునేదామె. ఈ మధ్య ఆమెకు నా ఒట్టు మీద అనుమానం పుట్టింది. ఏణ్ణర్థం క్రితం ఏదో విషయానికి తన మీద ఒట్టు వేస్తే చచ్చేటంత జబ్బు చేసి చచ్చి బ్రతికింది. అప్పట్నించీ ఆమె ఒట్టును తన మీంచి పిల్లల మీదకు మళ్లించింది. పిల్లల మీద ఒట్టు వేయడానికి నేను బాగా ఆలోచిస్తానని తన నమ్మకం.

నేను ఒట్లను అంతగా నమ్మేవాడిని కాదు. మేధావి వర్గానికి చెందిన వాడినని గుర్తింపు లభించేక మాత్రం ఒట్లేమిటి - మూఢనమ్మకాలనేవి కూడా చాలా వరకూ నా జీవితంలో భాగం కాసాగాయి. ఒక పని ప్రారంభించాలంటే మంచి రోజు చూడడమూ, ఏడాదికి రెండు సార్లయినా ప్రత్యక్ష దైవాన్ని దర్శించుకుని నాకు జరిగిన మేలుకా దర్శనమే కారణమని సమర్థించుకోవడమూ, వ్రతాలు చేయడం, పిల్లలకు దిష్టి తీయించడం - ఇలా ఎన్నో, ఎన్నో.......

ఇప్పుడు నేను పిల్లల మీద ఒట్టెయినా వేయాలి... లేదా టీవీ చూడాలి ... లేదా ఏకాగ్రతతో శ్రీమతి మాట వినాలి.

అటుపైన జనవరి 20 అలా అలా కరిగి పోతుంది.

పిల్లిని కూడా నాలుగు గోడల మధ్య ఉంచి తలుపులు మూస్తే పులిలా ఎదురుకుంటుంది.

అప్పుడు నాలోని పులి విజృంభించింది.

ముందు నేను పిల్లల మీద ఒట్టేసి శ్రీమతిని పంపించేశాను. అప్పుడు నాకు అప్రయత్నంగా వెంకటరమణయ్య స్ఫురించాడు. అయన వయసు యాభై మూడు. రాష్ట్ర ప్రభుత్వోద్యోగి.

కాగితం మీద అయన వ్యక్తిత్వాన్ని వర్ణిస్తే మహాత్ముడు అనిపిస్తుంది. ఇంట్లో మాత్రం అంతా ఆయన్ను అసమర్థుడు అంటాడు. పిల్లలు అప్పుడప్పుడు దుర్మార్గుడని కూడా అంటారు.

ఆయన నీతి, నిజాయితీలను త్రికరణశుద్ధిగా నమ్మిన గాంధేయవాది.

ఆయన సీట్లో ఏడాదికి లక్ష రూపాయలైనా అదనంగా సంపాదించవచ్చు. ఆయన సెలవులో ఉన్నప్పుడా సీటు కొందరికి విపరీతమైన లాభాలు తెచ్చిపెట్టింది. అది చూసి కూడా ఆయన మారలేదు.

కూతురి పెళ్ళికి చేసిన అప్పింకా తీరలేదు. కొడుక్కి ఫీజు కట్టలేక ఇంజనీరింగుకు బదులు సైన్సు చదివించాడు. పెళ్ళానికి ఉన్న నగలమ్మడమే తప్ప కొత్తవేం చేయించలేదు. పాతబడిన అద్దె యింట్లో ఉంటున్నాడు. కొడుక్కి ఉద్యోగం సంపాదించడానికి లంచమివ్వ డుట. మంచి సంబంధం వస్తే కట్నం తీసుకోడుట.

ఇంట్లో అయన్ని మెచ్చుకునే వారు లేరు. బయట ఆయన్ను గౌరవించేవారు లేరు. వెంకట రమణయ్య పుత్రరత్నం నన్ను తరచుగా కలుస్తూంటాడు. ఆయన మాకు దూరపు బంధువు కూడా నేమో - ఎప్పుడైనా నేను వాళ్ళింటికి వెడుతూంటాను. అప్పుడాయన భార్య నాకు తన కష్టాలన్నీ చెప్పుకుని, 'నువ్వయినా ఆయనకు చెప్పి చూడు నాయనా!' అంటుంది.

వాళ్ళ కష్టాలు నన్ను నిజంగానే కదిలించాయి. వెంకటరమణయ్యకు నేను ప్రస్తుతం సమాజపు తీరు తెన్నులకు అనుగుణంగా మారవలసిన అవసరం గురించి పలుమార్లు చెప్పాను.

ఆయన తన వేదాంతాన్నిలా చెప్పాడు.

''జీవితంలో కొందరు జీవిస్తారు. కొందరు బ్రతుకుతారు. రెండింటికీ తేడా లేదని చాలా మంది అనుకుంటారు. తనక్కావలసింది ఎలా సంపాదించాడూ అన్నది మనిషికి ముఖ్యం. దాన్ని బట్టే అది జీవితమా, బ్రతుకా అన్నది తేలుతుంది. నా జీవితంపట్ల నాకు రవ్వంత అసంతృప్తి కూడా లేదు. నా వాళ్ళ అసంతృప్తి అంటావా - రోగికి పథ్యం సాయించదు. అంతే!'

ఇది విని కూడా నేను నా ప్రయత్నం మానలేదు. బీ.ఏ రోమన్ ఇన్ రోమ్ అన్న ఆంగ్ల సామెతననుసరించి రోగగ్రస్థ సమాజంలో రోగిలాగే బ్రతకాలనుకున్నాను.

''రోమ్, ఏమిటి - ఎక్కడకు వెళ్ళినా నేను పదహారణాల ఆంధ్రుడిలాగే ఉంటాను' ' అన్నాడాయన.

ఆయన్ను మార్చడం అసాధ్యమని ఆ యింట్లో అంతా అంటారు. వాళ్ళకు జీవితం జీవించాలని లేదు. బ్రతకాలని ఉంది. తమ జీవితంలో జీవం లేదని వాళ్ళంటారు.

ఇప్పుడు నాకో గొప్ప అయిడియా వచ్చింది.

వెంకటరమణయ్యలో ఉన్నట్లుండి మార్పు వచ్చింది. ఆయన ఒక తేదీని నిర్ణయించుకుని అప్పటినుంచీ మారిపోవాలనుకున్నాడు. అందుకో మనిషిని కూడా నిర్ణయించుకున్నాడు. ఒక పార్టీ నుండి ఆయనకు పది వేల రూపాయలు కూడా అందుతాయి. అక్కణ్ణించి ఆయనకు డబ్బు... డబ్బు... ఒకటే డబ్బు....

ఇంట్లో అంతా ఆయన్ను దేవుడని పొగుడుతున్నారు. ఆ రోజు కోసం ఎదురు చూస్తున్నారు ఆత్రుతగా.... ఆ రోజు రాకుండానే వారందర్నీ సంతోషం అపరిమితమై కమ్ముకుంది. ప్రతి ఒక్కరి మనసులోనూ కొత్త జీవితానికి పథకాలు రూపుదిద్దుకుంటున్నాయి.

ఆ రోజు.....

ఆ రోజును నేను జనవరి 21 గా నిర్ణయించుకున్నాను. ఎందుకంటే నా గడువు కూడా ఆ రోజుతోటే ముగుస్తుంది.

తాగుబోతు లారీ డ్రైవరు - విచక్షణలేని పోలీసాఫీసరు - రైలు ప్రమాదం - ఫుడ్ పాయిజనింగు - కరెంటు షాకు.....

ఒకటేమిటి - లక్ష పద్ధతులున్నాయి ఆయన్ను చంపడానికి.....

ఆయన చావు ఓ మహాత్ముణ్ణి పతనం నుంచి కాపాడుతుంది.

ఆయన చావు కొందరు సామాన్యుల బ్రతుకు ఆశలను చిగురించనీకుండా చేస్తుంది.

ఆయన చావు ఎంత సామాన్యంగా జరిగినా ఫరవాలేదు. సాహిత్యంలో ఆ చావుకు చావుండదు. ఇంతవరకూ నేను ఎన్నో కథలు వ్రాశాను. నవలలు వ్రాశాను. సినిమాలకు పనిచేశాను. కానీ యిలాంటి రచన ఎప్పుడూ చేయలేదు.

ఆ కథరాస్తూ నేను వెంకటరమణయ్య కుటుంబంలో కలిసిపోయాను. ఆయన వ్యక్తిత్వంతో మధనపడ్డాను. కథ పూర్తయ్యాక వెక్కి వెక్కి ఏడ్చాను.

ఎన్నో చావుల గురించి వ్రాశాను. కానీ ఈ చావు నన్ను బాగా కదిలించింది.

జనవరి 21 రాకుండానే నా కథ పూర్తయింది. ఇలాంటి హత్య నా రచనల్లో ఎన్నడూ జరుగలేదు.

నాకు తెలుసు.... నేను హంతకుణ్ణి.....పాఠకుల మెప్పు కోసమో, ప్రేక్షకుల నుంచి డబ్బు కోసమో, కథనంలో పటుత్వం కోసమో నేను ఎన్నో పాత్రలను హత్య చేశాను. కానీ ఈ హత్య ఒక్కటే నన్ను కదిలించింది. ఎందుకో మరి!

కథను పత్రికకు పంపేలోగా ఎవరికైనా చదివి వినిపించాలని నాకు ఉబలాటంగా ఉంది. శ్రీమతికి వినిపిస్తే సగంలో నిద్ర పోయింది. పిల్లలు నా కథ వ్రాయడం పూర్తికాకముందే నిద్రపోయారు.

మర్నాడు తెల్లవారుతూనే నిరంజన్ నన్ను నిద్ర లేపాడు.

వాడు నా చిన్ననాటి స్నేహితుడు. కలుసుకుని పదేళ్ళయింది. సకుటుంబంగా వచ్చాడు.

విడిపోయే ముందుదాకా మేమిద్దరం సాహితీ చర్చలు చేస్తూండే వాళ్ళం. అప్పటికి నేనింకా కథలు వ్రాయటం మొదలుపెట్టలేదు. నిరంజన్ రచయిత కాడు కానీ మంచి చెడ్డల తారతమ్యం లేకుండా అన్నీ చదివి చక్కగా విమర్శించేవాడు.

ఇప్పుడు నిరంజన్ మంచి సమయానికే వచ్చాడు.

పిల్లలు - పిల్లలు........ ఆడవాళ్ళు ఆడవాళ్ళు.

నేను, నిరంజన్!

వాడు నా కథ చదివాడు. ఏకబిగిన పూర్తి చేసి నిట్టూర్చాడు.

"నీ అభిప్రాయం?" అన్నట్లు చూశాను.

"నువ్వు సాహిత్యాన్ని హత్య చేస్తున్నట్లు విన్నాను. నీ రచనలు చదివి ఆ అభిప్రాయాన్ని నమ్మాను. ఈ కథ నా అభిప్రాయాన్ని మార్చింది. ఇది సాహిత్యాన్ని బ్రతికించడానికి చేసే మంచి ప్రయత్నం. రచయితగా నీ ప్రయత్నం నువ్వు చేశావు. అటు పత్రికల నుంచి కూడా ఇటువంటి ప్రయత్నం జరుగుతోందో లేదో చూసుకున్నావా?"

ఏమో మరి - ఆ విషయం నేనేం చెప్పగలను? ఓ కొత్త పత్రిక నుంచి వచ్చిన ఆహ్వానమే నన్నీ కథకు పురిగొల్పింది - అంతకు మించి నాకు మాత్రం ఏం తెలుస్తుంది! ★

*(పల్లకి వార పత్రిక - 17-3-'93)*